అందని ద్రాక్షగా అధునాతన విద్యాలయం!

- విద్యార్థులకు దూరాభారం, వసతుల లేమి
- ఈ ఏడాదిలోనూ తప్పని ఇబ్బందులు
- ఆదిలోనే ఆగిపోయిన నిర్మాణ పనులు

సికింద్రాబాద్: బడులు, కళాశాలల తరగతులు ప్రారంభమవుతున్న తరుణంలోనూ సీతాఫల్‌మండి ప్రాంత ప్రభుత్వ విద్యార్థులకు ఇబ్బందులు తప్పేటట్టు లేవు. ఈ విద్యా సంవత్సరంలోనూ ఇక్కడి ప్రభుత్వ పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అధునాతన భవనం అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ఫలితంగా ఈ ఏడాది కూడా వందలాది మంది విద్యార్థులు దూరాభారాన్ని భరించాల్సి రావడంతో పాటు, అరకొర వసతుల మధ్యే విద్యాభ్యాసం చేయాల్సి వస్తుంది. సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ విద్యార్థులకు తరగతులు కొనసాగేవి. తరగతి గదుల కొరత కారణంతో జూనియర్, డిగ్రీ కళాశాల తరగతులు షిఫ్టు పద్ధతుల్లో కొనసాగించే వారు. పాఠశాల భవనం పాతబడుతుండడం, తరగతి గదుల కొరత ఉండడం కారణంతో అధునాతన సదుపాయాలతో కొత్త విద్యా భవన సముదాయం నిర్మాణానికి రూ. 30 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు రెండేళ్ల క్రితం సిద్ధం చేశారు. అదే సమయంలో ఇక్కడి పాఠశాల భవనాన్ని నేలమట్టం చేశారు. 2023 మే 1న విద్యా సంస్థల నిర్మాణం పనులను ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఏడాది కాలంలోపు నిర్మించ తలపెట్టిన విద్యా సంస్థల భవనం నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం మారడంతో నిర్మాణం పనులు ఈ ఏడాదిలో అయినా పూర్తవుతాయో లేదో అని చర్చించుకుంటున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు..

ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నేలమట్టం చేసిన క్రమంలో ఇక్కడి పాఠశాల తరగతులను కిలో మీటర్ దూరంలోని ఓయూ మోడల్ స్కూల్ భవనంలోకి మార్చారు. సీతాఫల్‌మండి పరిసర ప్రాంత విద్యార్థులు రైల్వే ఫ్లైఓవర్‌ను దాటుకుని ఓయూ మోడల్ స్కూల్‌కు వెళ్లడం ఇబ్బందికరంగా మారుతోంది. జూనియర్ కళాశాల తరగతులను మేడిబావిలోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్లో సాగిస్తున్నారు. కమ్యూనిటీహాల్ భవనం చిన్నది కావడంతో తరగతులు నిర్వహించడం ఇబ్బందికరంగా మారింది. అధ్యాపకులకు కనీసం కూర్చునేందుకు గది కూడా ఇందులో లేకపోవడం గమనార్హం. సీతాఫల్‌మండి డిగ్రీ కళాశాల తరగతులను విద్యానగర్‌లోని పాత డిగ్రీ కళాశాల భవనంలోకి మార్చారు. ఈ పురాతన భవనంలో తరగతుల నిర్వహణ ప్రమాదకరంగా పరిణమించిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కిలోమీటర్ల మేర కళాశాలకు వెళ్లేందుకు దూరాభారాన్ని భరించాల్సి వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు.



పునాదితోనే నిలిచిపోయిన పనులు



సీతాఫల్‌మండిలో నిర్మించనున్న విద్యా సంస్థల భవన నమూనా చిత్రం

ప్రభుత్వం మారినా పనులు ఆగవు..



కేవలం సాంకేతిక పరమైన కారణాలతో మాత్రమే విద్యా సంస్థల నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వం నిర్మాణం పనుల కోసం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం మారిన కారణంతో ఇబ్బందులేమీ ఉండవు. అధునాతన పద్ధతుల్లో సికింద్రాబాద్‌లో ప్రభుత్వ విద్య సముదాయాన్ని వచ్చే ఏడాదిలోగా అందుబాటులోకి తెస్తాం. కొత్తగా జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేశాం. కొంత సమయంలో శాశ్వతంగా నిలిచిపోయే భవనాలు నిర్మిస్తాం.

–పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే

ప్రతిపాదన తీరు ఇదీ!

సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఒక ఎకరం విస్తీర్ణం కలిగిన విశాలమైన స్థలం ఉంది. ఇందులో రూ.29.75 కోట్ల వ్యయంతో ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనాలను ఒకే సముదాయంలో నిర్మించేందుకు బృహత్తర రణాళిక సిద్ధం చేశారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్‌ను మొత్తంగా పార్కింగ్‌కు వదిలి ఆపైఐదు అంతస్తుల్లో ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల తరగతులు, ప్రయోగశాల, సమావేశ మందిరాలను నిర్మించేందుకు ప్లాన్ సిద్ధం చేశారు. అధునాతన సాంకేతికతతో కూడిన తరగతి గదులు, స్టాఫ్‌రూంలు, ప్రయోగశాలల కోసం నిర్మాణ సమయంలోనే ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు.

నిర్మాణంపై నీలినీడలు..

గత సంవత్సరం శాసనసభ ఎన్నికలకు ఆరు నెలల ముందే ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ నిర్మాణం పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. ఆ మీదట నిర్మాణం పనులు ఆయనే ప్రారంభించి ఏడాది గడిచింది. పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే శాసనసభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఆ తరువాత ఇలా పనులు మొదలయ్యాయో లేదో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. కారణాలేవైనా ఏడాది కాలంగా పునాది నిర్మాణంతోనే నిలిచిపోయిన పనులు ముందుకు సాగడం లేదు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ ఏడాదిలో అయినా విద్యా సంస్థల నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

తరగతులు ప్రారంభమాయె.. సౌకర్యాలు లేకపాయె!

- పలు పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- వసతుల లేమితో ఇబ్బందులు
- దృష్టి సారించని విద్యాశాఖ అధికారులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు పాఠశాలలు ఈసారి కూడా సమస్యలతోనే విద్యార్థులకు స్వాగతం పలికాయి. నియోజకవర్గంలో 12 ఉన్నత, 35 ప్రాథమిక, 15 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి, మధ్యాహ్న భోజన షెడ్ల నిర్మాణం, ఎలక్ట్రికల్ వైరింగ్, తాగునీటి వసతి, మూత్రశాలల, మరుగుదొడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డు అధికారులకు పనులను అప్పజెప్పింది. ఎన్నికల సాకుతో బోర్డు అధికారులు పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు చేతులెత్తయడంతో మే నెలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. పనులు ప్రారంభం అయినప్పటికి ప్రభుత్వం నుంచి అరకొర నిధులు విడుదల కావడంతో నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రభుత్వం స్కావెంజర్లు, స్వీపర్లను నియమించకపోవడంతో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరవడంతో దుమ్ము పట్టిన బెంచీలు, బూత్ బంగ్లాల దర్శనమిచ్చాయి. ఉపాధ్యాయులే సొంత డబ్బులు వెచ్చించి స్కావెంజర్లను ఏర్పాటు చేసి పాఠశాల తరగతి గదులను శుభ్రం చేయించాల్సిన దుస్థితి నెలకొంది.



మడ్‌ఫోర్ట్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు, మధ్యాహ్న భోజనం షెడ్డు పనుల కోసం తీసుకొచ్చి వదిలేసిన సామగ్రి

సమస్యలున్నా పాఠశాలలివే..

- మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో రూ.70 లక్షలతో చేపట్టే అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తాగునీటి వసతుల ఏర్పాటుకు ఇంకా పనులు కొనసాగుతున్నాయి. సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేయాల్సి ఉంది.
- బోయిన్‌పల్లి ప్రభుత్వ బాలుర పాఠశాల, జీజీపీఎస్ కార్ఖాన, లాల్‌బజార్ బాలుర పాఠశాలల్లో మైనర్ రిపేర్లు డ్రైనేజీ పైపులైను పనులు తాగునీటి వసతి పనులు కొనసాగుతున్నాయి.
- పికెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గతుల నిర్మాణ పనులు ఇప్పటికి ప్రారంభం కాలేదు.
- కాకాగూడ జీబీపీఎస్ పాఠశాల్లో తాగునీటి ఏర్పాట్ల పనులు, ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి.
- డొంటన్‌బజార్ జీజీపీఎస్ పాఠశాల్లో ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు జరుగుతున్నాయి.



తాగునీటి ఏర్పాటు కోసం కొనసాగుతున్న పనులు

అందని యూనిఫాం. పాఠ్యపుస్తకాలు..

కంటోన్మెంట్ నియోజకవర్గంలో బుధవారం పాఠశాలలు ప్రారంభమైనా విద్యార్థులకు యూనిఫామ్, పలు పాఠ్యాంశాలకు సంబంధించిన పుస్తకాలు ఇంకా పాఠశాలలకు చేరలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందజేయాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులది కాని ఆ దిశగా ఏలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఒకటో రెండో నోట్‌బుక్స్ పట్టుకుని తరగతి గదుల్లో కూర్చోవడం కనిపించింది. మే నెలలో పనులు ప్రారంభం కావడం.. ప్రభుత్వం నుంచి నిధులు అరకొరగా విడుదల కావడంతో పనులు ఇంకా కొనసాగుతున్నాయి. కొన్ని పనులు ప్రారంభం కాలేదని త్వరితగతిన వాటిని పూర్తిచేసి విద్యార్థులకు మౌలిక వసతులను కల్పిస్తామని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

గురుకుల కొత్త టీచర్ల ఎదురు చూపులు

పోస్టింగ్ తేదీలను వెల్లడించాలని డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలు వచ్చాయని చేసే పనులు మానుకొని పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నామని ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు ఎంపికైన కొత్త టీచర్లు వాపోతున్నారు. బుధవారం ఓయూలో వారు మాట్లాడుతూ..గురుకుల టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన టీచర్లకు పోస్టింగుల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గతేడాది ఆగస్టు నెలలో పరీక్ష రాసి ఎంపికైన అభ్యర్థులకు 2024 మార్చి 4న ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్న నియామకపు పత్రాలను 60 రోజుల్లో ఉద్యోగంలో చేరాలని పేర్కొన్నారని కానీ..100 రోజులు గడుస్తున్న ఇంత వరకు ఎలాంటి కదలిక లేకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీచర్ ఉద్యోగ నియామకపు పత్రాలు అందుకున్న సుమారు 5000 మంది అభ్యర్థులు మూడు నెలలుగా నిరీక్షిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామక పత్రాలను అందుకున్న తర్వాత చేసే పనులను మానుకొని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన. ఎన్నికల కోడ్ ముగిసినా టీచర్ల పోస్టింగ్‌ల పక్రియ పై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. గురుకుల్లో ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లకు త్వరితగతిన పదోన్నతులు, బదిలీల పక్రియను పూర్తి చేసి కొత్త వారికి వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. లేదా ఇంకా సమయం తీసుకుంటే తేదీలపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు.

వీసీల నియామకాల్లో ఆలస్యంపై ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాలకు కొత్త వీసీల నియామకాలలో జాప్యం పట్ల సీనియర్ అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 15 వరకు వీసీలను నియమిస్తారనే ఆశతో ఎదురు చూసిన ప్రొఫెసర్లకు రాష్ట్ర ప్రభుత్వం నియామకపు ప్రక్రియను ప్రారంభించక పోవడంతో నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా వీసీల నియామకానికి ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ సభ్యులను ఎంపిక చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం, యూజీసీ తరుపున ఒక్కొక్కరిని నియమించగా యూనివర్సిటీల పాలక మండలి (ఈసీ) నుంచి మూడో వ్యక్తిని సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తారు. అయితే వర్సిటీలు నియమించిన సెర్చ్ కమిటీ సభ్యులపై వీసీ పదవీకి దరఖాస్తు చేసుకున్న ప్రొఫెసర్లు అభ్యంతరం తెలుపుతున్నారు. ఎందుకంటే వర్సిటీ పాలక మండలి చైర్మన్‌గా వీసీ వ్యవహరిస్తారు.. సెర్చ్ కమిటీ సభ్యుని నియామకంలో వీసీదే కీలక పాత్ర. వారికి అనుకూలమైన వ్యక్తులను సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమించుకోవచ్చు. అయితే పదవీ కాలం ముగిసిన కొందరు మరోమారు వీసీ పదవీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తాము పదవీలో ఉన్నప్పుడు నియమించిన సెర్చ్ కమిటీ సభ్యులు ఇప్పుడు వారికి అనుకూలంగా వ్యవహరిస్తారనే అనుమానం ప్రొఫెసర్లు వ్యక్తం చేస్తున్నారు. రెండో సారీ వీసీ పదవీ కోసం దరఖాస్తు చేసుకున్న వర్సిటీలకు పాత వారిని తొలగించి కొత్త వ్యక్తిని సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమించాలని సీనియర్ ప్రొఫెసర్లు కోరుతున్నారు.

బీసీ కులగణన ప్రక్రియను ప్రారంభించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ కులగణన పక్రియను ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబరు.26 తీసుకొచ్చి బీసీ కులగణనకు బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించిన అంశాన్ని గుర్తు చేశారు. కులగణన చేపట్టి కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు రవి, కిరణ్ పాల్గొన్నారు.

14 నుంచి హెచ్‌సీఏ క్రికెట్ టోర్నమెంట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రేపటి (14న) నుంచి మూడు వారాల పాటు హెచ్‌సీఏ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్న కార్యదర్శి, బీసీసీఐ లెవల్–1 కోచ్ ప్రొ.సత్యనారాయణ తెలిపారు. నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో రేపు (14న) ఉదయం 7 గంటలకు రెండు రోజుల లీగ్ మ్యాచ్ జరుగుతాయని ఓయూ కాలేజీలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 8520011662, 9000627456 నం సంప్రదించాలన్నారు.

పురాతన భవనాలకు నోటీసులు

బన్సీలాల్‌పేట్: వర్షాకాలంలో పురాతన భవనాలతో ప్రజలకు ఇబ్బందులు, సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ క్రిష్టఫర్ చెప్పారు. బేగంపేట్ సర్కిల్ పరిధిలో ఇప్పటికే పురాతన భవనాలు, ప్రమాదకరంగా ఉన్న బిల్డింగ్‌లను గుర్తించడం జరిగిందన్నారు. బేగంపేట్ సర్కిల్ పరిధిలో సుమారు 60 పురాతన భవనాలకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో పలు భవనాలకు మరమ్మతులు చేయించుకోవాలని, మరి కొన్నింటిని వెంటనే ఖాళీ చేయాలని కోరామన్నారు. అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని వాటిపై వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందిస్తున్నామన్నారు. ఫిర్యాదులు వచ్చిన మోండా మార్కెట్ ఓల్డ్‌జైల్ సమీపంలోని ఓ కట్టడానికి అదే విధంగా రాణిగంజ్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లోని పలు నూతన నిర్మాణాలకు నోటీసులు ఇచ్చామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

రసూల్‌పురా: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తోందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకోవడంతో బాలంరాయి ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య, నోటు పుస్తకాలను హెచ్‌ఎం కొండప్పతో కలిసి జంపన ప్రతాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో మహానీయులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరారని తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కంటోన్మెంట్‌లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ. 2 కోట్ల విడుదల చేశారని త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ముప్పిడి గోపాల్, నరేష్, పాఠశాల ఇన్‌చార్జి భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైల్లో గంజాయి తరలిస్తున్న నలుగురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: రైల్లో గంజాయి తరలిస్తున్న పలువురిని జీఆర్‌పీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ డీఎస్పీ జావెద్ కథనం ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం గజపతి జిల్లాలో ఉత్పత్తి చేసిన గంజాయిని ఇద్దరు వ్యక్తులు నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా సికింద్రాబాద్‌కు తరలించారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు మరో ఇద్దరు గంజాయిని తీసుకున్నారు. ఈ నలుగురు రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారి బ్యాగులను తనిఖీ చేయగా 24 కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సీలుబస్తరాయ్ (29), కిరణ్‌బాగ్‌సింగ్ (26), సచిన్‌పాట్లసింగ్ (24), మహారాష్ట్రకు చెందిన షేక్‌రిజ్వాన్ (27)ను రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులోని మహారాష్ట్రకు చెందిన మరో ఇద్దరు లక్ష్మణ్‌కాలే, రాహుల్ పింబ్లె పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులు.. సూపర్ పనులు



జీహెచ్‌ఎంసీ అధికారులకు సమస్య వివరిస్తున్న శ్రీనివాసులు

సికింద్రాబాద్: ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడంతో పాటు రహదారులపై ప్రమాదకర పరిస్థితులను దూరం చేసేందుకు చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వ విభాగాల అధికారులను సమన్వయం చేసుకుని ఇప్పటికే పలు రహదారులపై నెలకొంటున్న ప్రమాదకర సమస్యలకు పరిష్కారం చూపిన ట్రాఫిక్ పోలీసులు బుధవారం ఒలిఫెంటా వంతెన సమీపంలోని చిలకలగూడ కూడలిలో మురుగు నీటి సమస్యకు పరిష్కారం చూపించారు. లోతట్టు ప్రాంతంగా ఉన్న ఈ కూడలిలో మురుగు, వరద నీటిని బయటకు తరలించేందుకు సంప్‌లు నిర్మించారు. ఈ సంప్‌లలో ఏర్పాటు చేసిన మోటార్లు కొంతకాలంగా పనిచేయడం లేదు. ఫలితంగా వరద, మురుగు నీరంతా రహదారులపై నిలిచిపోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యను చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన అధికారులు మూడు మోటార్లు బిగించి మురుగు, వరదనీటి నిల్వలు రహదారులపై లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు.

బాలకార్మిక నిర్మూలనపై అవగాహన ర్యాలీ



సికింద్రాబాద్: బాలకార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆర్‌పీఎఫ్ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సరస్వత్ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లలో, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. బాలకార్మికుల అక్రమ రవాణా సమాచారాన్ని పోలీసులకు చేరవేయడం, తద్వారా బాలలకు విముక్తి కలిగించే పద్ధతులను ప్రయాణికులకు వివరించారు. ఈ ర్యాలీలో బచ్‌పన్ బచావో ఆందోళన్ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్లింగ్టన్ రోడ్డును.. వెల్‌డన్‌గా మార్చారు



నాడు



నేడు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సికింద్రాబాద్‌క్లబ్ నుంచి ఏఓసీ సర్కిల్‌కు వెళ్లే మార్గంలోని వెల్లింగ్టన్ రోడ్డు ఎట్టకేలకు బాగు పడింది. చిన్నపాటి వర్షానికే రోడ్లంతా జలమయమయ్యేది. గంటల తరబడి నీరు నిలిచి రాకపోలకు ఇబ్బందులు తలెత్తేవి. వాహనాదారుల, స్థానికుల అభ్యర్థన మేరకు మిలటరీ ఇంజనీరింగ్ విభాగం స్పందించి కమాండర్ వర్క్స్ ఇంజనీర్ (ఆర్మీ) సికింద్రాబాద్, జేఈ (సౌత్) రోడ్లు పనులు చేపట్టారు. ట్రాఫిక్ పోలీసులు కూడా సహకరించడంతో కేవలం పది రోజుల్లో రోడ్డు పనులు పూర్తి శభాష్ అనిపించారు. రోడ్డు సైతం అందంగా నిర్మాణ పనులు చేపట్టడంతో స్థానికులు, వాహనాదారులు మిలటరీ ఇంజనీరింగ్ విభాగానికి ప్రశంసిస్తున్నారు.


తార్నాకలో తెలుగు ఆరోమాస్ రుచులు



సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ మేయర్ కార్తీకరెడ్డి

లాలాపేట: విభిన్న ఆహార రుచులకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ నగరం నిలుస్తుందని మాజీ మేయర్ బండా కార్తీకచంద్రారెడ్డి అన్నారు. తార్నాకలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగు ఆరోమాస్(తెఆ) బిర్యానీ, పులావ్ హోటల్‌ను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. తెలుగు ఆరోమాస్ రుచులతో బిర్యానీ, పులావ్ వంటి నాన్‌వెజ్ వంటకాలను తార్నాక వాసులకు అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. నాణ్యమైన ఆహార పదార్థాలను అందించడంతో పాటు శుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బండా చంద్రారెడ్డి, నిర్వాహకులు పాశం అరవింద్, శ్రావణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్ రాజు, నేతలు వీరన్న, సంపత్, సాయినాథ్‌గౌడ్, కిరణ్‌గౌడ్, శివారెడ్డి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ




చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన 135 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో అన్ని రకాల ప్రభుత్వ పథకాలను నియోజకవర్గంలోని అర్హులైన అందరికీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, నాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, సుంకు రాంచందర్, జీ.చంద్రశేఖర్, రాజసుందర్, రాజేశ్ పాల్గొన్నారు.



యూనిఫామ్,బుక్స్ పంపిణీ చేస్తున్న శ్రీగణేష్



రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్న పద్మారావుగౌడ్



యూనిఫామ్ అందజేస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి



రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్న చీర సుచిత్ర

బడికి వచ్చేశాం!

పాఠశాలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులతో తరగతి గదులు కిటకిటలాడాయి. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలలను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి విద్యార్థులకు పాఠ్య, రాతపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేసి విద్యార్థులకు స్వాగతం పలికారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379